బాబు అనుభవం జనాన్ని మోసగించటానికే

- ఆదర్శ పాలన అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి
- పశ్చిమంలో వైభవంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు


పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ అనుభవం యావత్ ప్రజలను మోసగించటానికే ఉపయోగించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దిన వేడుకలు బుధవారం పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం వద్ద వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నేతలు తదితరులు దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నాయకులతో కలిసి వెలంపల్లి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదర్శవంతమైన పాలన అందించారని, ఆయన హయాంలో పేద ప్రజలకు మంచి జరిగిందన్నారు. కోవిడ్ కష్ట కాలంలోనూ అన్ని పథకాలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలని, ప్రతి ఒక్కరు చదువుకోవాలని, అందరికీ వైద్యం ఉచితంగా అందించాలని జగన్ ఆలోచించడమే కాక ఆచరణలో చేసి చూపించారన్నారు. జగన్ ప్రభుత్వం ప్రతి తల్లికి అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందిస్తే దానిని కూటమి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. రైతులందరికీ రైతు భరోసా పేరున రూ.13 వేలు ఇస్తే, చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తానని మోసం చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలన్నీ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా రూపుదిద్దుకున్నాయంటే అది జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన వలనే అని అన్నారు. ప్రజలందరూ మొన్న పొరపాటు జరిగిందని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు బండి పుణ్యశీల, మనోజ్ కొఠారి, తోలేటి శ్రీకాంత్, కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, యరడ్ల ఆంజనేయ రెడ్డి, ఎండీ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్య రెడ్డి, బాపతి కోటి రెడ్డి, గోదావరి గంగ, శిరంశెట్టి పూర్ణ, యలకల చలపతిరావు, వివిధ డివిజన్ల ఇన్‌చార్జులు తంగెళ్ల రామచంద్రరావు, బంక విజయ, నాయకులు బొందిలి నరేంద్ర సింగ్, షేక్ హయత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాపక్షమే

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాపక్షమేనని, ప్రజల సమస్యల పరిష్కారం దిశగానే ముందుకు సాగుతుందని 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో ఆమె పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలయినా సూపర్ 6లో ఒక్కటైనా అమలుకు నోచుకోలేదని అన్నారు. ఏడాది కాకుండానే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు షేక్ హయాత్ షరీఫ్, మైనార్టీ నాయకులు ఎస్కే నజీర్, దాదాభాయ్, ఎస్సీ, బీసీ నాయకులు విజయ్, రేలంగి నరసింహారావు, వెంకట్, వైఎస్సార్‌టీయూసీ నాయకులు పఠాన్ ఇస్మాయిల్, ఎస్కే ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

47వ డివిజన్ అధ్యక్షుడు నాగ ఆధ్వర్యంలో...

వైఎస్సార్ సీపీ 47వ డివిజన్ అధ్యక్షుడు కూరాకుల నాగ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దేరంగుల రమణ పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. అనంతరం నాగ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో శీరం వెంకట్రావు, బి.రాజేష్, ఎం.కమలాకర్, ఎస్.వెంకటేష్, ఆర్.క్రాంతికుమార్, షేక్ రషీద్, తాండ్ర ఇంద్రకుమార్, గాలి దుర్గాప్రసాద్, నన్నం దుర్గ, ఇ.విజయలక్ష్మి, దిద్దుకూరి శివ, వి.రవీంద్ర, రాజా నాయుడు, పి.శివ, ఎం.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


పార్టీ జెండా ఎగురవేస్తున్న రెహమతున్నీసా


47వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దిన వేడుకలు

క్లుప్తంగా

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ శ్రీగౌతమ్ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. శ్రీగౌతమ్ స్మార్ట్ క్యాంపస్‌లో హైస్కూల్, స్మార్ట్ క్యాంపస్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు నమూనాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. సైన్స్ ఎగ్జిబిషన్‌ను పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి పత్తిపాటి శ్రీధర్, స్కూల్ డైరెక్టర్ ఎస్.సూర్యారావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత, నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయన్నారు. విద్యార్థులకు ఆయా రంగాలపై ఆసక్తిని పెంచేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు పరిశీలించి వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను అభినందించారు. గుండె, మూత్రపిండాలు, ఊపిరి తిత్తులు, చంద్రయాన్-3, సౌర కుటుంబం, వర్షం నీటిని నిల్వ చేసి శుద్ధి చేసుకునే విధానం తదితర అంశాలపై రూపొందించిన ప్రాజెక్టు నమూనాల గురించి విద్యార్థులు వివరించారు. . కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పి.తులసి, స్కూల్ ఇన్‌చార్జీలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక కరకట్ట సౌత్ రోడ్‌లోని పున్నమి ఘాట్ వద్దనున్న శ్రీదుర్గా భవానీ దేవస్థానం ఆలయ పునర్నిర్మాణానికి పారిశ్రామికవేత్త, ఆధ్యాత్మికవేత్త కోగంటి సత్యనారాయణ రూ.3లక్షలను విరాళంగా అందజేశారు. అమ్మవారి విగ్రహానికి రూ.2.50లక్షలు, ఉపాలయంలో శ్రీకృష్ణ భగవానుడి విగ్రహం ఏర్పాటుకు రూ.51,000లను చెక్‌రూపంలో దేవస్థానం కమిటీ ప్రెసిడెంట్ గంటా వెంకట్రావు, సెక్రటరీ పైడి రాజులకు అందజేశారు. ఈ సందర్భంగా కోగంటి సత్యం మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, దేవాలయాల అభివృద్ధికి విరాళాన్ని అందించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈసందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు దాత కోగంటి సత్యంను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి సురేష్, ముక్కామల శివరాం ప్రసాద్, దాసి రామ్మోహన్, ఎండీ అయాజ్, తులసి మురళి, కానాల వినోద్ కుమార్, మూర్తి రాజు, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కుటుంబ కలహాల నేపథ్యంలో మానసికంగా కుంగిపోయిన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట నామాల వారి వీధికి చెందిన కోటిపల్లి నాగరాజు(40) డెకరేషన్ పనులు చేస్తుంటాడు. నాగరాజుకు గతంలో వివాహం కాగా ఆమెతో విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నాడు. కొన్నేళ్ల తర్వాత రమ్య అనే మహిళను ప్రేమించి పెళ్లి చేసుకుని వైఎస్సార్ కాలనీలో కాపురం పెట్టాడు. అనంతరం రమ్యతో కూడా గొడవలు జరగడంతో భార్యను వదిలి కొత్తపేటలో ఉంటున్న తండ్రి కామేశ్వరరావు వద్ద ఉంటున్నాడు. అప్పటి నుంచి ముభావంగా ఉంటున్న నాగరాజు తనకు బతకడం ఇష్టం లేదని తల్లిదండ్రులతో చెప్పేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తల్లిదండ్రులిద్దరూ పనికి వెళ్లగా ఇంట్లో ఉన్న నాగరాజు బాల్కనీలోని సీలింగ్ హుక్‌కు కాటన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి పక్కనే నివసించే ఉమా అనే మహిళ చూసి నాగరాజు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న నాగరాజు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

లేడీస్ హాస్టళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

అడ్మిన్ డీసీపీ సరిత

విజయవాడస్పోర్ట్స్: మహిళల వసతి గృహాల పరిసరాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను అమర్చాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.జి.వి.సరిత ఆదేశించారు. మహిళ భద్రతలో భాగంగా జిల్లాలోని లేడీస్ హాస్టల్స్ యజమానులతో డీసీపీ సరిత కమిషనరేట్‌లో బుధవారం సమావేశమయ్యారు. మహిళల భద్రతకు పోలీస్ కమిషనరేట్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, సురక్ష కమిటీలు, ఈ-పహారా, సైబర్ సిటిజన్స్, అస్త్రం, విక్టిమ్ కాంపెన్‌సేషన్, క్లోజ్‌పెట్రోలింగ్, ట్రాఫిక్ అంబాసిడర్స్, ఫాల్కన్, చేరువ తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. వసతి గృహాల పరిసరాల్లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలపై నిత్యం పోలీస్ మానటరింగ్ ఉంటుందన్నారు. హాస్టల్స్ పరిసరాల్లో ఎవైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే వెంటనే పోలీస్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని పంచాయతీ రాజ్ శాఖ చీఫ్ ఇంజినీర్ కె.విజయకుమారి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో వివిధ క్లబ్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఆయా విభాగాలు అందించే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగటానికి కృషి చేయాలన్నారు. టెలి కమ్యూనికేషన్స్ శాఖ విజయవాడ ఆఫీసర్ ఇన్‌చార్జి అభిషేక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములైనప్పుడు మరింత విజ్ఞానవంతులవుతారన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, విభాగాధిపతి డాక్టర్ ఎం.రంగారావు, అధ్యాపకులు జె.రాజ్యలక్ష్మీ, ఎస్.శివగోవింద్, డాక్టర్ వి.జయప్రకాష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, షేక్ మహబూబ్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఆర్ సీఈ విజయకుమారి

ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి పెట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని మణిపాల్ విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ భావనరి మల్లికార్జున్ సూచించారు. కేబీఎన్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎక్స్పెండింగ్ అకాడమిక్ ఆరిజన్స్ ఫర్ సఫిస్టికేటెడ్ టెక్నాలజీస్' అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన మల్లికార్జున్ మాట్లాడుతూ రసాయన శాస్త్ర విభాగంలో అత్యున్నత పరిశోధనలు, నవీన పరికరాల రూపకల్పన రంగాల్లో శాస్త్రవేత్తల కొరత తీవ్రంగా ఉందన్నారు. విద్యార్థులు ఆయా విషయాలపై దృష్టి సారిస్తే చక్కటి భవిష్యత్తు పొందవచ్చన్నారు. దేశంలోని పలు విశ్వవిద్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పరిశోధనలకు ఉన్న అవకాశాలు, వాటిల్లో చేరేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. రసాయన శాస్త్ర అనువర్తనాలు విషయంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఉదాహరణలతో సమాధానాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ క్యాన్సర్‌తో సహా పలు దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో అవసరమైన శస్త్ర చికిత్స పరికరాలు, ఔషధాల రూపకల్పనలో నానో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. కార్యక్రమంలో హిందూహైస్కూల్స్ కమిటీ ఏఓ డాక్టర్ వి.నారాయణరావు, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఓ.శైలజ, అధ్యాపకులు డాక్టర్ కె.కిరణ్‌కుమార్, కె.పి.టి.విజయ్‌భాస్కర్, కె.స్వాతి, ఎల్.మౌనిక పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జున్

ఖాకీ కా హుకుం

- సీసీ కెమెరాలు పెట్టాలి..డబ్బులివ్వండి
- చిరు వ్యాపారులపై భవానీపురం పోలీసుల వత్తిడి

భవానీపురం(విజయవాడపశ్చిమ): '' మీ ప్రాంతంలో నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి... బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి... అందుకే ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అందుకు షాపునకు రూ.1000 చొప్పున ఎవరో ఒకరు వసూలు చేసి ఇవ్వండి.'' ఇదీ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక సెక్టార్ ఎస్ఐ చిరు వ్యాపారులకు జారీ చేసిన హుకుం. రెండు రోజుల క్రితం సాయంత్రం సమయంలో సెంటర్‌తో పాటు పరిసరాలలో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారందరినీ పిలిపించుకుని ఈ హెచ్చరికలు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నేరాల నియంత్రణకు ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలిగానీ తమ వద్ద నుంచి బలవంతంగా వసూలు చేయటమేమిటని వ్యాపారులు వాపోతున్నారు. ప్రజల భాగస్వామ్యంతో నేరాలను అరికట్టడంలో తప్పు లేదు గానీ, బడ్డీ కొట్లు, టైలరింగ్ షాపులు వంటి చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ పొట్ట పోసుకునేవారిని అడగటం ఎంతవరకు సమంజసమని వ్యాఖ్యానిస్తున్నారు. పోలీసులు అడిగినంత డబ్బు ఇవ్వకపోతే ఏదో ఒక కేసులో ఇరికించి ఇబ్బంది పెడతారేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. సీసీ కెమెరాల ఏర్పాటుకు లక్షలాది రూపాయలను విరాళంగా ఇస్తున్నట్లు పోలీసులే ప్రకటనలు ఇస్తున్న తరుణంలో తమలాంటి పేదలను డబ్బు ఇవ్వాల్సిందేనంటూ భయభ్రాంతులకు గురి చేయటం న్యాయమా అని వాపోతున్నారు. ముఖ్యంగా పెద్దపెద్ద వ్యాపారాలు చేసేవారిని వదిలేసి చిరువ్యాపారులపై పోలీస్ జులుం ప్రదర్శించటం ఏమిటని వ్యాఖ్యానిస్తున్నారు. అసలు ఈ వ్యవహారం స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలిసే జరుగుతుందా.. లేదా ఉన్నతాధికారుల వద్ద మెహర్బానీ కోసం ఎస్ఐ స్థాయి పోలీసుల సొంత పెత్తనమా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

15న ఆలయ వార్షికోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం కొండ ప్రాంతంలో వేంచేసిన శ్రీ స్వయంభుశ్రీవల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ 9వ వార్షిక ఉత్సవాలను ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు టి.నాగరాజు తెలిపారు. స్వామివారికి నిర్వహించే విశేష పూజలు, కల్యాణోత్సవంలో భక్తులంతా పాల్గొనాలని కోరారు.

యూసీడీ కొత్త లైన్లు వేయండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ(యూసీడీ) కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం నగర పర్యటనలో భాగంగా ఆయన 13వ డివిజన్‌లోని న్యూ ఆర్టీసీ కాలనీ, ఎలక్ట్రిసిటీ కాలనీ, తోట వారి వీధి, కోనేరు వారి వీధి, జేడీ నగర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామాయణపు వారి వీధి, తోట వారి వీధి, కృష్ణానగర్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైప్ లైన్లు పాతవి కావటంతో తరచుగా సమస్యలు తలెత్తుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో కొత్త లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏవీ రామారావు రోడ్డు పూర్తిగా పాడైపోటం గమనించిన కమిషనర్ కొత్త రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ఎస్ఎస్ఎం స్కూల్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బోర్ వాటర్ కాకుండా అక్కడున్న ప్రజలకు రామలింగేశ్వర నగర్ నుంచి కృష్ణానది నీరు అందేటట్టుగా చర్యలు తీసుకోవాలన్నారు. థెరీసా పార్క్‌లో కావలసిన వసతులు కల్పించాలన్నారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునే పరికరాలతో ఆధునికీకరించాలని ఆదేశించారు. ప్రతి వార్డు సచివాలయం పరిధిలో డీసిల్టింగ్ పనులు ప్రతిరోజు జరుగుతూనే ఉండాలన్నారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ ముమ్మినేని ప్రసాద్, రెసిడెంట్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, జోనల్ కమిషనర్ కె. షమ్మి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపీ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాల్లో నీటి కొరత ఉండకూడదు

పటమట(విజయవాడతూర్పు): చలివేంద్రాలలో నీటి కొరత లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరివేక్షిస్తుండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో బుధవారం ఇంజినీరింగ్ సిబ్బందితో చలివేంద్రాలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిళ్ల పరిధిలో 77 చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిలో తాగునీటి కొరత ఉండకూడదని, ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ తాగునీరు నిత్యం ప్రజలకు అందేలా చూసుకోవాలని సర్కిల్ ఈఈలను ఆదేశించారు. అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేసిన చలివేంద్రాలే కాకుండా ఇంకా అవసరమైన ప్రాంతాలను పరిశీలించాలని ఆయా ప్రాంతాల్లో కూడా వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఇంజినీరింగ్ సిబ్బంది కమిషనర్‌కు నివేదికను ఇచ్చారు. సర్కిల్-1 పరిధిలో 22, సర్కిల్-2 పరిధిలో 27, సర్కిల్-3 పరిధిలో 28, చలివేంద్రాలు ఏర్పాటు చేయగా, చలివేంద్రాల నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, పర్యవేక్షిస్తూ ఫ్లోటింగ్ జనాభా ఎక్కువగా ఉండే ప్రాంతాలలో స్టాక్‌ను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ ఉంటున్నామని కమిషనర్‌కు వివరణ ఇచ్చారు.


డ్రైయినేజీని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఎస్ఆర్ఆర్ కాలేజీ స్థలాన్ని కాపాడాలి

ఆకుల శ్రీనివాస్ కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలకు చెందిన స్థలాన్ని ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని ఆ కాలేజీ పూర్వ విద్యార్థి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కళాశాలలో నేటి ప్రముఖులు ఎంతోమంది విద్యాభ్యాసం చేసి దేశవిదేశాల్లో కీర్తి గడించారని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కూడా ఇదే కళాశాల విద్యార్థి అని తెలిపారు. విజయవాడ నగరంలో విద్యార్థులు చక్కగా చదువుకుని అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో నూజివీడు జమీందారులు నాడు ఎస్ఆర్ఆర్ కళాశాలకు స్థలం అందించారన్నారు. ఒక మహోన్నత ఉద్దేశంతో వారు ఇచ్చిన స్థలాన్ని ఆక్రమణదారులు చెరపట్టడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించి కళాశాల స్థలాన్ని వారి నుంచి కాపాడాలని ఆయన కోరారు.

థియేటర్లలో వీఎంసీ ఫైర్ సిబ్బంది తనిఖీ



పటమట(విజయవాడతూర్పు): నిత్యం రద్దీగా ఉండే సినిమా థియేటర్లలో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవటంతోపాటు వాటిని నిరంతరం నిర్వహణ చేయాలని వీఎంసీ అగ్నిమాపక సిబ్బంది నగరంలోని ఆయా థియేటర్ల యజమానులకు సూచించారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో బుధవారం వీఎంసీ అగ్నిమాపక అధికారులు నగరంలోని దుర్గా కళామందిర్ థియేటర్, శైలజ థియేటర్ కాంప్లెక్స్, రాజ్ యువరాజ్ థియేటర్ కాంప్లెక్స్‌లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ఫైర్ అధికారి మాల్యాద్రి, రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫైర్ సేఫ్టీ సిస్టమ్స్ థియేటర్ వారితోనే ఆపరేట్ చేయించడమే కాకుండా థియేటర్ మొత్తంలో అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకున్నారా లేదా వంటి విషయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. సరిగా లేని చోట్ల యజమానులను హెచ్చరించామన్నారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా పాల్గొన్నారు.

ఉగాది కవితల పోటీకి ఆహ్వానం

విజయవాడ కల్చరల్: ఉగాది పండు సందర్భంగా జాతీయ స్థాయి కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు సంస్కారభారతి అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ, సుమధర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి పసుమర్తి భాస్కర శర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ, సుమధర కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో ఎవరైనా ఉచితంగా పాల్గొనవచ్చన్నారు. పంచ పరివర్తనలు(సామాజిక సమరసత, కుటుంబ వ్యవస్థ, స్వదేశీ జీవన విధానం, పర్యావరణ పరిరక్షణ, నాగరిక విలువలు) అంశంగా పోటీలుంటాయన్నారు. తగిన హామీ పత్రంతో 22వ తేదీ లోపు వాట్సాప్(94410 30937)కు పంపాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు సాయి శంకర్ (83747 60 657)ను సంప్రదించాల్సిందిగా సూచించారు.

బీరువా తాళాలు పగులగొట్టి చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బీరువా తాళాలు పగులగొట్టి 8 కాసుల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవీనగర్ ఒకటో లైన్‌కు చెందిన కనకయ్య శ్రీవాణి తమ కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఈనెల 11వ తేదీ మంగళవారం రాత్రి 11 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయారు. 12వ తేదీ బుధవారం తెల్లవారుజామున వాష్‌రూమ్‌కు వెళ్లటానికి నిద్రలేచిన శ్రీవాణి అత్త డోర్ తీసేందుకు ప్రయత్నించారు. కానీ డోర్ రాకపోవటంతో డయల్ 100కు ఫోన్ చేశారు. దీంతో పోలీసులు వచ్చి డోర్ ఓపెన్ చేశారు. దీంతో పక్కనే ఉన్న బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగుల కొట్టి ఉన్నాయి. పరిశీలించగా బీరువా లాకర్‌లో ఉంచిన 8 కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమికి ఫీజులెగిరేలా..

ఉవ్వెత్తున ఎగసిన యువతరంగం



విద్యార్థులతో కలసి కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, ఇతర నాయకులు



కూటమి తొమ్మిది నెలల పాలనపై యువాగ్రహం నిరసన గళమై నినదించింది. ఫీజులివ్వని బాబు సర్కారుకు ఫ్యూజులు మాడిపోయేలా విద్యార్థిలోకం నిప్పులు చెరిగింది. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ మాయ హామీలతో గద్దెనెక్కిన దొంగ ప్రభుత్వంపై సింహనాదమై గర్జించింది. ఎన్ని ఆంక్షలు విధించినా.. పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా లెక్కచేయక పదం పదం కలిపి కదం తొక్కింది. విజయవాడలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరులో విద్యార్థులు, నిరుద్యోగులు, యువతీయువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


మ్యూజియం వద్ద బారికేడ్లు పెట్టి నాయకులు, విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు



విద్యార్థులతో కలసి ర్యాలీగా వస్తున్న మేయర్, డెప్యూటీ మేయర్లు